క్లుప్తంగా

ఆస్పత్రిలో దుప్పట్లు పంపిణీ

కందనూలు: నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీ పరిధిలోని నాగనూలు గ్రామానికి చెందిన ఫ్రెండ్స్ సేవా సంఘం సంక్రాంతి పండుగను పురస్కరించుకొని బుధవారం రోగులకు పండ్లు, బెడ్‌షీట్స్, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ రఘు, ఆర్‌ఎంఓ ప్రశాంత్, రామచంద్రయ్య, చంద్రకంటి మహేష్, తదితరులు పాల్గొన్నారు.
కల్వకుర్తి మండలంలోని లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్ ఆధ్వర్యంలో తిమ్మరాజులో మహిళలకు బుధవారం రగ్గులు, దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ గవర్నర్ చెన్న కిషన్‌రెడ్డి, క్లబ్ జోన్ చైర్మన్ సంపతి జనార్దన్ రెడ్డి, డాక్టర్ దామోదర్ రెడ్డి, లక్ష్మారెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎడ్మసత్యం, మాజీ చైర్మన్ శ్రీశైలం, పర్వత్ రెడ్డి, రాంరెడ్డి, లింగయ్య, పిఆర్వో పాషా, సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ



కోడేరు: మండలంలోని మైలారం, నాగులపల్లి తండా, ముత్తిరెడ్డిపల్లి, తదితర గ్రామాల్లో మృతి చెందిన కుటుంబాలు, అనారోగ్యంతో బాధపడుతున్న కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి పరామర్శించారు. పార్టీ పరంగా అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాజవర్ధన్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

పోస్టర్ విడుదల



కల్వకుర్తి రూరల్: సీపీఎం రాష్ట్ర మహాసభలు విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆంజనేయులు కోరారు. బుధవారం పట్టణంలోని సీపీఎం కార్యాలయం ఎదుట రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 25వ తేదీ నుంచి 28వ తేదీ వరకు సిద్దిపేటలో మహాసభలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ముఖ్య అతిథులుగా పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు బృందా కారత్, బీవీ రాఘవులు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో ఆంజనేయులు, కానుగుల వెంకటయ్య, జగన్, బక్కయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

నాగర్‌కర్నూల్ క్రైం: ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలైన ఘటన మండలంలోని గగ్గలపల్లిలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన గణేష్‌లో ద్విచక్రవాహనంపై వెళ్తుండగా గ్రామ శివారులో ఆర్టీసీ బస్సు ఢీకొన్నది. ఈ ప్రమాదంలో తలకు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. ఘటనకు సంబంధించి విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చైనా మాంజాతో గొంతుకు గాయం

కల్వకుర్తి రూరల్: సంక్రాంతి సందర్భంగా బుధవారం గాలిపటం ఎగరవేస్తున్న సందర్భంలో ద్విచక్రవాహనంపై కల్వకుర్తికి వెళ్తున్న గోపి నాయక్‌కు చైనా మాంజా తాకి గొంతుకు కోసుకొని గాయమైంది. బాధితుడు స్థానిక ఆస్పత్రిలో చికిత్స చేసుకున్నాడు.

17 నుంచి ఖాదర్‌పాషా దర్గా ఉర్సు

కొల్లాపూర్: పట్టణంలోని ఖాదర్‌పాషా దర్గా ఉర్సు ఉత్సవాలు ఈనెల 17వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. 18వ తేదీన ఉర్సు నిర్వహిస్తునట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. జామె మసీదు నుంచి గంధోత్సవం బయలుదేరుతుందని తెలిపారు. అదే రోజు రాత్రి హైదరాబాద్‌కు చెందిన కళాకారులచేత ఖవ్వాలి ప్రదర్శనలు ఉంటాయిన వివరించారు. 19న దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేసి ముగించనునట్లు వివరించారు. మూడు రోజుల పాటు అన్నదానాలు ఏర్పాటు చేసినట్లు కౌన్సిలర్ నయూమ్ తెలిపారు.





అచ్చంపేటలో ముగ్గుకు రంగులు దిద్దుతున్న యువతులు



కల్వకుర్తిలో పాలు పొంగిస్తున్న గృహిణులు



తాడూరులో ర్యాలీగా వెళ్తున్న గ్రామస్తులు



లింగాలలో రామాలయం చుట్టూ తిరుగుతున్న ఎద్దులబండ్లు



వెల్దండ మండలం పెద్దాపూర్‌లో..

ఘనంగా సంక్రాంతి సంబరాలు

సాక్షి, నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా సంక్రాంతి పండగ సంబరాలను మూడు రోజులపాటు నిర్వహించారు. మొదటి రోజు సోమవారం బోగి స్నానాలు, రొట్టెల పండుగ, రెండో రోజు మంగళవారం మకర సంక్రాంతి పురస్కరించుకొని రంగురంగుల ముగ్గులు వేసి గొబ్బెమ్మలతో అలంకరించారు. మూడోరోజు కనుమ పండుగను కుటుంబసభ్యులతో ఉత్సాహంగా చేసుకున్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. తీపి వంటలు చేసుకొని ఆరగించారు. చిన్నారులు గాలిపటాలు ఎగురవేస్తూ సందడి చేశారు. గ్రామాల్లో విందులు ఏర్పాటు చేసుకొని సంతోషంగా గడిపారు. గ్రామాల్లో మహిళలకు ముగ్గుల పోటీలు ఏర్పాటు చేశారు. పలు గ్రామాల్లో క్రికెట్, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. దేవాలయాల చుట్టూ ఎడ్లబండ్లు, ట్రాక్టర్లతో ఊరేగింపుగా వెళ్లి తిప్పారు. విజేతలకు బహుమతులు అందజేశారు.



మన్ననూరులో



తెలకపల్లి మండలం గౌరారంలో ఎద్దుల బండ్ల ఊరేగింపు



కోడేరులో..



కల్వకుర్తిలో



పెద్దకొత్తపల్లి వెన్నచర్లలో



లింగాల మండలం కోమటికుంటలో..



కొల్లాపూర్ మండలం అంబేడ్కర్ కాలనీలో ముగ్గుల పోటీలు

భక్తిశ్రద్ధలతో ప్రభోత్సవం



ఉప్పునుంతలలో ప్రభోత్సవ ఊరేగింపు

ఉప్పునుంతల: స్థానిక కేదారేశ్వరాలయం నుంచి బుధవారం రాత్రి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రభోత్సవం నిర్వహించారు. ఉమామహేశ్వరానికి ఊరేగింపుగా వెళ్లారు. కట్ట నారాయణ్‌రెడ్డి, నాయకులు, భక్తులు, యువకులు పాల్గొన్నారు.
– అమ్రాబాద్ మండలంలోని అమరేశ్వరాలయం నుంచి బుధవారం రాత్రి నిర్వహించిన ప్రభోత్సవం భక్తిశ్రద్ధలతో కొనసాగింది. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో పార్వతీ పరమేశ్వరుని చిత్రపటాలు ఏర్పాటుచేసి పురవీధుల గుండా ఊరేగించారు. మహిళలు, యువకుల కోలాటాలు, భజనలు, నృత్యాలు, చూపరులను ఆకుట్టుకున్నాయి. ప్రజలు అధిక సంఖ్యలో వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఊరేగింపు అనంతరం రాత్రి ప్రభోత్సవాలను ఉమామహేశ్వరం క్షేత్రానికి తీసుకెళ్లారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు నాగరాజు, వివిధ పార్టీలు, సంఘాల నాయకులు పాల్గొన్నారు.
– మన్ననూర్ గ్రామంలోని వేణుగోపాల స్వామి ఆలయంలో నెలకొన్న అనిశ్చితి కారణంగా ఉమామహేశ్వర ప్రభోత్సవం నిర్వహణకు నిర్వాహకులు, భక్తులు రెండు గ్రూపులుగా విడిపోయారు. శాంతి భద్రతల దృష్ట్యా అమ్రాబాద్ సీఐ శంకర్ నాయక్ కల్పించుకుని ఇరువర్గాలను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి శాంతింపజేశారు. ఎట్టకేలకు ప్రభోత్సవ నిర్వహణకు ఒప్పుకున్నారు. ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ హాజరై పూజలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సీఐ, ఎస్‌ఐలు రజిత, వీరమల్లు ఆధ్వర్యంలో 30 మంది పోలీస్ గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.

ఘనంగా ఆర్మీడే వేడుకలు



జవాన్లను సన్మానిస్తున్న నాయకులు

వెల్దండ: మండల కేంద్రంలో ఆకృతి గార్డెన్‌లో బుధవారం ఆర్మీడే వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్మీ జవాన్లను, వారి తల్లిదండ్రులను నాయకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. దేశ రక్షణలో త్రివిధ దళాల జవాన్ల సేవలను గుర్తు చేసుకున్నారు. మండల కేంద్రంలో దాదాపుగా 40మంది యువలకు ఆర్మీలో పనిచేస్తున్నారని గ్రామస్తులు తెలిపారు. అనంతరం జవాన్ల క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఆర్మీ భవన నిర్మాణానికి దాతలు సింగిల్‌విండో డైరెక్టర్లు మట్ట వెంకటయ్యగౌడు రూ.1.20లక్షలు, సంజీవ్‌కుమార్‌యాదవ్ రూ.50వేలు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ చిందం కృష్ణయ్య, నాయకులు పర్వత్‌రెడ్డి, విజేందర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, హరికాంత్‌రెడ్డి, లింగంముదిరాజ్, రషీద్, యాదగిరి, మధన్‌గౌడు, యాదగిరి, ఆర్మీ సంక్షేమ సంఘం అధ్యక్షులు చంద్రశేఖర్‌గౌడ్, ఉపాధ్యక్షుడు పురుషోత్తంచారి, జవాన్లు యాదయ్య, ఆర్. శ్రీనివాసులు, భీమయ్య, తిరుపతయ్య, తదితరులు ఉన్నారు.

నేడు జిల్లా స్థాయి బండలాగుడు పోటీలు

ఉప్పునుంతల: మండలంలోని తాడూరులో సంక్రాంతి పండుగను పురష్కరించుకొని గురువారం జిల్లా స్థాయిలో సేద్యపు విభాగంలో ఎద్దుల బండ లాగుడు పోటీలు నిర్వహిస్తునట్లు నిర్వాహకులు గుండెమోని మాధవ్, బూరం రమేష్ తదితరులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజేతలకు మొదటి బహుమతి రూ. 25 వేలు, ద్వితీయ బహుమతి రూ. 20 వేలు, తృతీయ బహుమతి రూ. 15 వేలు, నాల్గో బహుమతి రూ. 10 వేలు ఇవ్వనునట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనే వారు ఉదయం 10 గంటల లోపు రూ. 1000లు ఎంట్రీఫీజు చెల్లించి పేర్లు నమోదు చేయించుకోవాలని కోరారు.

ఆలయానికి సెంట్రల్ లాక్స్ అందజేత



పాన్‌గల్: మండలంలోని మల్లాయిపల్లి గ్రామంలోని లక్ష్మీనర్సింహాస్వామి ఆలయానికి భద్రత నిమిత్తం 5 సెంట్రల్ తాళాలను దేవాలయం నిర్వాహకులు, గ్రామ పెద్దలకు బుధవారం అందజేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ఆలయంలో దొంగతనాల నివారణకు సెంట్రల్ తాళాలను అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. గ్రామంలో అందరూ ఐకమత్యంతో పనిచేస్తూ సీసీ కెమరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు.

భక్తులకు ప్రయోజనం

వీపనగండ్ల: మండలంలోని సంగినేనిపల్లి సమీపంలోని గుట్టల్లో వెలసిన లక్ష్మీనరసింహాస్వామి ఆలయంలో మంగళవారం కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చే భక్తులకు సౌకర్యవంతంగా ఉండేందుకు గతంలో రూ.నాలుగు కోట్లు మంజూరు చేయించానని, రోడ్డు నిర్మాణం పూర్తవ్వడంతో భక్తులకు మేలు జరిగిందన్నారు.

ముగిసిన లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు



క్యూలైన్‌లో నిల్చున్న భక్తులు

తిమ్మాజిపేట: మండలంలోని అప్పాజిపల్లిలో లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారంతో ముగిశారు. పలు ప్రాంతాల నుంచి భక్తులు పోటెత్తారు. మూడోరోజు బండ్లు, జాతర, ఉద్దాల కార్యక్రమాలు నిర్వహించారు. కోడుపర్తికి చెందిన చిలుక సురేందర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డిలు అన్నదానం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

తాండ్రలో 'సిడే'

కల్వకుర్తి రూరల్: మండలంలోని తాండ్రలో ఈదమ్మ మాందాత దేవి ఉత్సవాలలో భాగంగా సిడే నిర్వహించారు. గ్రామస్తులు, యువకులు రథాన్ని లాగేందుకు పోటీపడ్డారు. కాయతి ఆశాదిపు రెడ్డి, గోలి సురేందర్ రెడ్డి, కాయితి విజయకుమార్ రెడ్డి, మల్లేష్ గౌడ్, పాండు, కిష్టయ్య, వెంకటయ్య, హనుమంతు, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలలో ప్రత్యేక పూజలు



తాడూరు: మండలంలోని శిర్సవాడ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు చేశాయి. గ్రామస్తుల సహాయసహకారాలతో హోమం, యజ్ఞం, అర్చన, విష్ణుసహస్ర నామం నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

జూపల్లిలో కాటమయ్య బోనాలు



చారకొండ: మండలంలోని జూపల్లిలో గౌడ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కాటమయ్య బోనాలను నిర్వహించారు. మహిళలు బోనాలను అలంకరించి, డప్పు వాయిద్యాల చప్పుళ్ల మధ్య ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. గ్రామ దేవతలను దర్శించుకొని నైవేద్యం సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. సంఘం అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు సత్తూరి దశరథం గౌడ్, అక్కి హుస్సేన్ గౌడ్, సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా ఈదమ్మ మాదాంత ఉత్సవాలు

వెల్దండ: మండలలోని చెర్కూర్‌లో మంగళవారం ఈదమ్మ మాదాంత ఉత్సవాలలో భాగంగా బండి సిడే నిర్వహించారు. బుధవారం రాత్రి బండ్ల బోనాలు నిర్వహించారు. భక్తులు అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

భార్య ఎప్పుడూ ఫోన్ మాట్లాడుతోందని..

మనస్తాపంతో భర్త ఆత్మహత్య

కద్తాల్: భార్యపై అనుమానంతో ఓ భర్త ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో బుధవారం వెలుగు చూసింది. ఎస్‌ఐ వరప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. కద్తాల్‌కు చెందిన సిద్దిగారి శివశంకర్(28)కు నాగర్‌కర్నూల్ జిల్లా ఉర్కొండ మండలం జకినాలపల్లికి చెందిన మౌనికతో గతేడాది ఏప్రిల్ నెలలో వివాహం జరిగింది. భార్యాభర్తలు మొదటి నుంచీ గొడవపడుతుండేవారు. ఎప్పుడూ ఫోన్ మాట్లాడుతోందనే కారణంతో శంకర్ ఆమెపై అనుమానం పెంచుకున్నాడు. ఈక్రమంలో తీవ్ర మనస్తాపానికి లోనై మంగళవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో, ఫ్యాన్ కొండికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని తల్లి రాములమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆర్థికసాయం



కోడేరులో ఆర్థికసాయం అందజేస్తున్న పెయింటర్ యూనియన్ సంఘం నాయకులు

కోడేరు: మండల కేంద్రానికి చెందిన మల్లేష్ రెండు నెలల కిందట అనారోగ్యంతో మృతి చెందడంతో ఆ కుటుంబానికి 2001–02 బ్యాచ్ పూర్వ విద్యార్థులు కుటుంబాన్ని పరామర్శించి రూ.50వేల ఆర్థికసాయం అందజేశారు. అదేవిధంగా మండలంలోని బావాయిపల్లికి చెందిన కుర్మయ్య అనారోగ్యంతో మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని అభినవ యూత్ ఆధ్వర్యంలో బుధవారం కుటుంబాన్ని పరామర్శించి రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు.

రూ.14వేల ఆర్థికసాయం

మండల కేంద్రానికి చెందిన మధు పెయింటర్ పనిచేస్తూ గుండెపోటుతో మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని పెయింటర్ యూనియన్ సంఘం ఆధ్వర్యంలో కుటుంబాన్ని పరామర్శించి రూ.14వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యమంలో చాకలి రాములు, మహేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.
– వెల్దండ మండలంలోని మూడుమిద్దెలతండాకు చెందిన ఇస్లావత్ గోపాల్ ఇటీవల మృతిచెందడంతో తండావాసులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి బుధవారం రూ.32వేల ఆర్థికసాయం అందజేశారు. నాయకులు లక్ష్మణ్‌నాయక్, శ్రీనునాయక్, లక్ష్మణ్, తండావాసులు తదితరులు ఉన్నారు.

నన్నే ఆపుతారా.. ఎంత ధైర్యం మీకు?

- పోలీసులపై మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ఆగ్రహం



మాజీ ఎమ్మెల్యే బాలరాజును చుట్టుముట్టిన పోలీసులు



బైఠాయించిన మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ కార్యకర్తలు

అచ్చంపేట రూరల్: 'పూజలు చేయడానికి ఆలయానికి వస్తే నన్నే ఆపుతారా..? ఎంత ధైర్యం మీకు..'అని అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీశైల ఉత్తర ముఖద్వారమైన ఉమామహేశ్వర క్షేత్రంలో బ్రహ్మోత్సవాల ప్రారంభోత్సవానికి ప్రతి ఏడాది అచ్చంపేట భ్రమరాంబ దేవాలయం నుంచి ప్రభోత్సవాన్ని ఊరేగింపుగా తీసుకెళ్తారు. కాగా బుధవారం రాత్రి భ్రమరాంబ ఆలయంలో ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, అనురాధ దంపతులు పూజలు చేస్తున్న సమయంలోనే మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు తన అనుచరులతో అక్కడికి వచ్చారు. ఎమ్మెల్యే పూజలు చేసిన అనంతరం ఆలయంలోకి వెళ్లాలని పోలీసులు అడ్డుకున్నారు. వారి మాటలు వినకుండా మాజీ ఎమ్మెల్యే గువ్వల ముందుకు కదిలారు. దీంతో పోలీసులు అప్రమత్తమై వెంటనే మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ నాయకులను చుట్టుముట్టారు. ఆలయంలో పూజలు కూడా చేయనివ్వరా అని పోలీసుల తీరును నిరసిస్తూ అక్కడే బైఠాయించారు. కొంత సమయం తర్వాత పోలీసులు నచ్చజెప్పి అక్కడి నుంచి ఆలయంలోకి వెళ్లడానికి అనుమతివ్వడంతో సద్దుమణిగింది. కాగా మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, బీఆర్‌ఎస్ కార్యకర్తలు గుంపు ఒక్కసారిగా రావడంతో ఘర్షణ జరుగుతుందోనని ముందు జాగ్రత్తగా కాసేపు ఆగాలని చెప్పామని, వారే తమపై దురుసుగా ప్రవర్తించారని పోలీసులు చెప్పారు.